# తిరిగిరాని స్వాతంత్ర్యం !

"లాస్టాగస్టులో నీడెక్కడున్నాడో గాని, చూడే నూకాలూ, ఈ వాళ నా కాళ్ళకి కదలని బంధంగా తయారయాడు వెధవాయి" అంటూ, కాళ్ళెందుకో తన్నుకుంటూ ఖాళీగావున్న చేత్తో మెళ్లో దండలు సవరిస్తూ, పాలు తాగుతున్న నానిగాన్ని ఉద్దేశించి అంది పార్వతి. పార్వతి మాటలు అగాయిత్యంగా తోచాయి నూకాలుకి. అందుకే మందలింపు స్వరంతో అంది "మరీ చెప్పొచ్చావమ్మా, పండులాంటి పాపాయిని బంధం అంటావేమిటి? ఇంతా చేసి మూణ్ణెల్లేనా రాలేదు!" ఈ లోకంలో యింకే యితర వ్యాపకం లేనట్లు, పాలు తాగడంలోనే మునిగిపోయి నానిగాడు తనలో తనే ఏదో మాట్లాడుకుంటున్నాడు. నవ్వుకుంటున్నాడు. పట్టులాంటి వాడి జుట్టు సవరిస్తూ పార్వతి అనుకుంది. ఏదో బంధం కాక మరేమిటి? అవును లాస్టాగస్టులో ఈ నాటి సాయంత్రం అప్పుడే ఎంతో సరదాగా పార్వతి, కృష్ణమూర్తి పెద్ద పట్టణవు పేవుమెంట్లమీద విహరిస్తున్నారు. స్వాతంత్ర్య దిన సందర్భాన వెలిగించిన వన్నె చిన్నెల దీపాలు చూస్తూ తమ భావిజీవితమూ అన్ని వన్నెల తీరులూ పోతుందనీ, పోవాలనీ తలపోస్తూ పెద్దపట్టణవు పేవుమెంట్ల మీద విహరిస్తు

న్నారు కాని ఈనాడో? సెలవైనా కృష్ణమూర్తికి ఏదో పనే! స్నేహితురాళ్ళ ఇండ్లలో స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని జరిగే విందులు ఆరగిస్తూ బాతాకానీ వేస్తూ ఇంటికే రాలేదు ఇంకాను. పార్వతి హృదయం పాపాయికి తల్లిఅయింది కాని, కృష్ణమూర్తి విషయంలో అసలొక అంగుళమైనా పెరగలేదుకూడా కాకుంటేమిటి? ఆనాడు వేటివేటికై మనస్సులో పిరికితనం ఆవేశింప చేసుకుని బాధపడిందో, యీ నాటికి అవే ఆమెలో వుండి బాధ పెడుతున్నాయి. అవసలు వాస్తవం కాదనీ, వాటికసలు అర్థం లేదని పార్వతికి తెలుసు. అన్ని చిన్న విషయాలకి సహితం పసిపాపలా కృష్ణమూర్తి తన మీదనే ఆధారపడతాడనీ తెలుసు. పాప రాకతో యీ బంధాలు మరీ సన్నిహితం అయాయనీ తెలుసు. అయినా చిన్న పురుగేదో మెదడుని దొలిచేస్తూంటే కళ్ళు తెరచిన జ్ఞానం రవంత మాయమయిపోతూ వుంటుంది. మళ్ళీ మరుక్షణంలోనే మనస్సు తేలికయి నిజాలు కళ్ళకి కడతాయి. ఊహలో మునిగిన పార్వతికి పాపాయి వడిలోనే నిద్రించడం గుర్తుకే రాలేదు.

సాయంత్రం ఆరూ ఆరున్నర వేళ. సెలవు కనక విశాల ప్రపంచం అంతా ఎంత ప్రశాంతంగా వున్నా కృష్ణమూర్తి ఎప్పుడేనా యిలా ప్రశాంతంగా వుండేవారా? ఏదో హడావిడి! ఎక్కడికో ఎప్పుడూ ప్రయాణమే! కాని ఈ రోజు పార్వతికి ఆ ప్రశాంతంలో వుండే విలువ తెలిసివచ్చింది. కృష్ణమూర్తి ఎక్కడికో వెళ్ళాడు; పాపాయిని చూసుకుంటూ పార్వతి యీ వర్తమానాన్నే మరిచింది.

పాపా యో వారానికి పుడతాడనగా పార్వతి ఎంత ఆందోళన పడిందని! ఏమిటి యిదంతా? ఎందుకొచ్చినదీ బాధంతా? ఎవరి సంతృప్తికోసం? అని ఎన్ని ప్రశ్నలు వేసు కుంది? ఏ ప్రశ్నకీ సమాధానం రాకుండానే, వారం దాటక పాపాయి పుట్టాడు. ఈ క్షణాన వళ్ళో ప్రశాంతంగా పడుకుని ఎందుకో తనలో తనే నవ్వుకుంటూన్న నానిగాణ్ని చూసి పార్వతి నవ్వుకుంది. వెధవాయి. ఎంత బాధపెట్టాడూ?! ఈ ప్రపంచంలోకి అంత బాధపెట్టి తాను రాకుంటే పోయే దేముందో!

ఆ రోజు ఆస్పత్రిలో జరిగిన ప్రతి క్షణం పార్వతి కనులలో మెదలింది. ఇక కొద్ది గంటలకే వీడు పుడతాడనగా కృష్ణమూర్తిని చూసింది. ఏవో తెలియని ఆందోళనతో చెరిగిన జుట్టుతో పాపం! కృష్ణమూర్తి! "ఇక మనకి పాపలు వద్దు పార్వతీ, నువ్వు బాధపడితే నే చూడలేను!" అంటూ చేతులతో ముఖం కప్పుకున్న కృష్ణమూర్తిని ఎలాగ ఓదార్చడం? అని ఎంత బాధపడింది పార్వతి. కాని మరు క్షణాన్నే కృష్ణమూర్తిమీద ఒళ్ళు తెలియని కోపం వచ్చింది పార్వతికి. "ఛీ, ఆడదనగానే ఎంత లోకువ, తమ సంతోషంలో యితరుల సంతోషిస్తున్నారనీ, అసలు ఇతరులను సంతోషపెట్ట డమే తమ లక్ష్యం అనీ ఈ మొగవాళ్ళ విశ్వాసం కాబోలు! ఎంత స్వార్థం? దాని కెంత చక్కటి రంగుపూత!" అనలీ కృష్ణమూర్తికి ఇంతటి స్వార్థం వుంటుందని పార్వతి ఎప్పుడూ ఊహించుకోనైనా లేదు. అది తెలిసే సరికి పార్వతికి ఎక్కడ లేని అసహ్యం వేసింది. కృష్ణమూర్తిని తానెందుకు ఓదా

ర్చాలి? అన్నట్లు ముఖం పక్కకు తిప్పేసుకుంది ... ఆ కొద్ది గంటలు తను యమయాతన పడుతూంటే, చావు బ్రతుకుల మధ్య తచ్చాడుతూవుంటే-హాయిగా కూర్చుని సిగరెట్టుమీద సిగరెట్టు అంటిస్తూ కాలాన్ని పూదేస్తూ వుంటాడు కృష్ణ మూర్తి — అన్న తలపులు వచ్చేసరికి పార్వతికి దుఃఖం పొంగి పొరలి వచ్చింది. అసలు బాధకంటే యీ తలపుల బాధ ఎక్కువయింది పార్వతికి.

కళ్ళుమూసుకుని పడుకునేందుకు ప్రయత్నించింది... అసలు పాప పుడతాడన్న కొన్ని నెలలనుంచీ కూడా రాత్రిళ్లు భరించరాని నిశ్శబ్దసమయాల్లో—విపరీతమైనదేదో తనకి జరిగి పోతుందని తలపోసేది పార్వతి. కాని బొత్తిగా పసిదానిలా భయపడి పోతలచుకోలేదు పార్వతి. కాని ఎంత ధైర్యం చిక్క బట్టినా, ఏదో క్షణంలో దారుణమైన భయం ఆవహించి, నమ్మినిలచిన భూమేలేకుండా కాళ్ళకిందనుంచి తప్పించుకు పోతున్నట్లు బాధ పడేది. ఊహాలు కళ్ళేలులేని గుర్రాల లాగ పరుగులు తీసేవి. ఇదంతా ఏక్షణంపాటో! యిలాంటి భయభ్రాంతుల మధ్యనే అసలు ఘడియలు సమీపించాయి. అన్నిరకాల ప్రిపరేషనులూ అతి జాగ్రత్తగా జరిగిపో యాయి. ఆస్పత్రిలో బాధామయఘట్టం ప్రారంభమయింది... ఆ మొదటి నొప్పులు క్రూరంగా కత్తుల్లా దూసి పార్వతిని ఒణికించాయు ఏ శుభోదయానికి నాంది! కళ్ళనీళ్ళు ధారా వాహినిగా ప్రవహించి పోతూంటే పార్వతి అనుకుంది. చిరు నవ్వు నవ్వుకుంది పార్వతి. కృష్ణమూర్తి ఓ క్షణంపాటు వచ్చి పార్వతి నుదుటిమీది చెమట తుడిచి, ఎవరూ చూడకుండా పెదవులు తాకి బయటికి వెళ్ళిపోయాడు. అభిమాన పూరితం

అయినా ఆ చిన్న చేష్టతో ఎక్కడలేని ధైర్యం వచ్చింది పార్వతికి. ఇంతలో డాక్టరు వచ్చింది. చిరునవ్వు నవ్వుతూ, "మనం అంతా యింతే — యిక్కడికే వస్తాం" అన్నట్లు మాట్లాడకుండా వూరుకుంది. "ఏదో శిఖరాగ్రానికి కష్టపడి ఎక్కి, అక్కడినుంచి పడడమే తరువాయి అన్నట్లు దేనికో ఎదురుచూడ్డం? యింకో క్షణంలో అంతా అయిపోతుంది. నేనూ అయిపోతాను" పార్వతి ఆలోచనలు అడ్డగోలుగా పరుగెడుతున్నాయి. మళ్ళీ కత్తుల్లాంటి ఈ నొప్పులు! యివి శుభాన్ని చేకూర్చే శాంతిదూతల్లా లేవు. కోట గోడలు పగలవేసి కోటని అక్రమించుకుందు కుద్యమిస్తూన్న సైన్యాల్లా వున్నాయి! వీటి ధాటి తగ్గదు. ఆకాశాన్ని చీల్చుకుని భూభాగంమీద మానవమాత్రుల చెవులు బద్దలుచేసే ఉరుముల్లా ఎందుకొచ్చినవి యివి? అర్థంలేని యిలాంటి ఆలోచనల మధ్య పార్వతికి తెలుస్తూనే వుంది; తుది ఘట్టంలో పడుతున్నానని. బ్రతికుంటే చూసుకుందాం అన్న వేదాంతం ఆవహించింది పార్వతిని. ఎంత గట్టిగా అరిచిందీ; అంత వేదాంత దృష్టి ఏమయిపోయిందో; ఎవరో తన సహాయానికి రావాలని, ఎవరైనా తనని చూసి జాలి పడాలని, అయినా ఎవరూ రారు. డాక్టరు మరేం భయం లేదంటుంది. తను చచ్చిపోతుంది. తన ఆత్మ తనను వదిలిపోతూంది. తనని మారుదిక్కు లేకుండా ఏకాకిగా వుండి భయపీడితురాలిగా వుండి, తను వూహించిన దానికంటె, వూహించి ధైర్యం చెప్పుకున్న దానికంటే వేయి రెట్ల బాధతో చనిపోతూంది. అయినా ఎవరూ రారు. "నేను దాన్ని భరించలేను, నన్ను దానిని భరించమనడమే దారుణం"

అని వాపోయింది పార్వతి ఏడ్చింది. ఓడిపోయినట్లు. భయంతో ప్రాణాలు దక్కించుకుందుకు పరుగెత్తి తుదకు ఓడిపోయినట్లు—పార్వతి ఏడ్చింది. అసలున్న యింగితజ్ఞానం ఏమయింది? ఆత్మ గౌరవం అంతా ఏమయింది? ఒక స్త్రీకి ఉండవలసిన ఓర్మి అంతా ఏమయింది? ఎందుకూ? అసలిప్పుడు తనో స్త్రీ కాదు, మనిషి కాదు, నరక యాతనకు గురిఅయి, చావు బ్రతుకులమధ్య తచ్చాడుతూన్న ఒక జంతువు తను! అంతే. ఆ క్షణంలోనే యీ ప్రపంచాన్నే మరచి పార్వతి సొమ్మసిల్లింది.

తరువాత... తరువాత... మెత్తటి తెల్లటి పక్కమీద పడుకుని వుంది. 'బద్ధకంగా! చిలిపిగా లావాలాంటి ఆమె భయాన్ని, కోపాన్ని ఎక్కి నురుగు తుంపరలలాంటి చిరు నవ్వు, ఆనందం...తో బద్ధకంగా చిలిపిగా పడుకునివుంది పార్వతి. ఆమె ప్రక్కనే పడుకొని వున్నాడు. జాలీ, కరుణా అనేవే లేకుండా తనదారి తను చూచుకుని యీ ప్రపంచం లోకి వచ్చిన యీ వెధవాయి! చూడ్డానికి గమ్మత్తుగా, యింకే యితర పాపలాగా కాకుండా ఎర్ర ఎర్రగా వున్నాడు. ఏదో తనకే తెలియని కారణాల ప్రోద్బలంతో పాపని చేతుల్లోకి తీసుకుంది పార్వతి.

గడిచిన ఘట్టాల నెమరువేతలో మునిగిపోయిన పార్వతికి పక్కన కృష్ణమూర్తి వచ్చి కూర్చున్నదీ, నానిగాడు నిద్ర కూడా లేచి కాళ్ళూ చేతులు తన్నుకుంటూ ఆడుకుంటున్నదీ తెలియనేలేదు. "ఏమిటి పార్వతీ అలావున్నావు? నానిగాడి కేం బాగులేదా?" ఆత్రంగా అడిగాడు కృష్ణమూర్తి.

"అబ్బే బాగానే వున్నాడు. అందుకు కాదు కృష్ణా" కాని ఎందుకో;.. ఎలా చెవుతుంది?

"ఈవేళ అలాపోయి దీపాలూ అవీ చూసొద్దామా?"

"నానిగాణ్ణి కూడా తీసుకుపోదాం" అంది పార్వతి.

"వాడెందుకు పార్వతీ, నలిగిపోతాడు. యింటిదగ్గర నూకాలుందిగా."

"వెధవాయి దీపాలుచూసి ఆడుకుంటాడు చూడు. అప్పుడు వాడి ముఖం చూస్తే యిప్పుడిలా అవనే అనవు నువ్వు" నానిగాడిజుట్టు సవరిస్తూ అంది పార్వతి. కృష్ణమూర్తి ఆశ్చర్యపోయాడు—పార్వతి ఎంత మారిపోయింది! ఉండబట్టలేక అన్నాడు.

"లాస్టాగస్టు జ్ఞాపకం వుందా పారూ."

తనకేసి పార్వతి భుజాన్ని తిప్పుకుంటూ.

"ఎందుకు జ్ఞాపకం లేదూ? కాని, ఆ స్వాతంత్ర్యం యిక తిరిగిరాదు. ఎప్పుడూ రాదు. చూడు, నువ్వూ, వీడూ నా స్వేచ్ఛని పంచేసుకున్నారు" అంది పార్వతి తృప్తిగానవ్వుతూ, చెరిగిన కృష్ణమూర్తి ఉంగరాలజుత్తు సవరిస్తూ.